క్లుప్తంగా

'విశ్వకర్మ యోజన'కు దరఖాస్తుల ఆహ్వానం

బంట్వారం: కేంద్రం ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'విశ్వకర్మ యోజన' పథకానికి అర్హులైన విశ్వకర్మ కులస్తులు ఈ నెల 10వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని బీజేపీ గీతాసెల్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశంగౌడ్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కమ్మరి, వడ్ల చేతి వృత్తులకు కేంద్రం చేయూతనిస్తుందని తెలిపారు.

ఘనంగా ఎల్లమ్మ బోనాలు



జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి

తాండూరు టౌన్: పట్టణ పరిధి వాల్మీకినగర్ శ్రీ రేణుకా ఎల్లమ్మ అమ్మవారి బోనాల జాతర శనివారం ఘనంగా జరిగింది. ఈ ఉత్సవంలో ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు.

రాములోరి సన్నిధిలో....

యాలాల: యాలాల మండలం జుంటిపల్లి అటవీ ప్రాంతంలో కొలువైన సీతారామస్వామి దేవాలయాన్ని శనివారం తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సతీసమేతంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు.. మనోహర్‌రెడ్డి దంపతులను ఆశీర్వదించారు. అనంతరం 108 కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ కౌన్సిలర్ నీరజ, నాయకులు బాల్‌రెడ్డి, భీమయ్య ఉన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

మర్పల్లి: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని స్పీకర్ ప్రసాద్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి అన్నారు. శనివారం మర్పల్లి మండల కేంద్రంలోని హనుమాన్ మందిరం వద్ద జరిగిన అయ్యప్ప మహా పడిపూజ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారు మాట్లాడారు. ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని సూచించారు. ఈ ప్రాంత అభివృద్ధికి పార్టీలకు అతీతంగా కృషి చేస్తామని చెప్పారు. మండల కేంద్రంలో అయ్యప్ప మందిరం కోసం స్థలం సేకరిస్తే, నిర్మాణానికి సహాయ సహకారాలు అందజేస్తామని వెల్లడించారు. గురుస్వాములు వినోద్‌శర్మ, శ్రీనివాస్, రవీందర్, నాయకులు సుభాష్‌యాదవ్, రాములు యాదవ్, నర్సింహులు యాదవ్, వెంకటేశం, మల్లేశం, శేఖర్, రామేశ్వర్, దివాకర్, సురేష్, ఫసియొద్దీన్, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

పండుగ సాయన్న విగ్రహ ప్రతిష్ఠాపనకు కృషి

కుల్కచర్ల: పండుగ సాయన్న విగ్రహ ప్రతిష్ఠాపనకు కృషి చేస్తున్నామని ముదిరాజ్ సంఘం ఇప్పాయపల్లి గ్రామ అధ్యక్షుడు గాదే రామయ్య శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విగ్రహావిష్కరణకు సంఘం జాతీయ కార్యదర్శి కాసాని వీరేశ్ ముదిరాజ్ ముందుకు వచ్చారని తెలిపారు. ఈ నెల 10న విగ్రహాన్ని ప్రతిష్ఠించేందుకు చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. కార్యక్రమానికి పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో పాటు మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి, ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, జెడ్పీటీసీ రాందాస్ నాయక్, సీనియర్ న్యాయవాది బాలముకుందం, సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, సంఘం కుల్కచర్ల మండల అధ్యక్షుడు చంద్రలింగం హాజరుకానున్నారని పేర్కొన్నారు. కావున ముదిరాజ్‌లు అధిక సంఖ్యలో రావాలని పిలుపునిచ్చారు.

చలాన్లు చెల్లించి, రాయితీ పొందండి

ధారూరు: పెండింగ్ చలాన్లు ఈ నెల 10వ తేదీ లోగా చెల్లించి రాయితీ పొందాలని సర్కిల్ సీఐ రామకృష్ణ, ఎస్‌ఐ సంతోష్‌కుమార్‌లు కోరారు. శనివారం వారు మాట్లాడుతూ.. సబ్సిడీతో కూడిన చెల్లింపునకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం ఇచ్చిందని, ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గడువులో చెల్లించాలని, లేని యెడలా మోటారు వాహనాల చట్టం ప్రకారం వాహనదారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న స్పీకర్

అనంతగిరి: తెలంగాణ టీచర్స్ యూనియన్(టీటీయూ) ఆధ్వర్యంలో ప్రచురించిన నూతన సంవత్సరం క్యాలెండర్‌ను శనివారం వికారాబాద్‌లో సభాపతి ప్రసాద్‌కుమార్ ఆవిష్కరించారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు కరణం దత్తాత్రేయరావు, ప్రధాన కార్యదర్శి రాములు, సమద్, లక్ష్మయ్య, బల్వంత్‌రెడ్డి, ప్రభాకర్, కిష్టయ్య, వెంకటయ్య, విఠల్‌రెడ్డి, బాబయ్య, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

'ప్రజాపాలన' సమాప్తం

అభయహస్తం కార్యక్రమం ముగిసింది. సాధారణ ఎన్నికల నేపథ్యంలో ప్రకటించిన ఆరు గ్యారంటీల అమలుకు.. అర్హుల నుంచి దరఖాస్తులను కోరుతూ కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా డిసెంబర్ 28నుంచి గ్రామగ్రామన నిర్వహించిన గ్రామసభలకు వినూత్న స్పందన లభించింది. లక్షలాది మంది తమకు కావాల్సిన పథకాల కోసం అర్జీలు పెట్టుకోగా.. వాటి కంప్యూటరీకరణకు సైతం సంబంధిత అధికారులు పనులు మొదలు పెట్టారు.

ఆరు గ్యారంటీల కోసం వెల్లువలా వచ్చిన అర్జీలు

- ఆన్‌లైన్ నమోదుకు శ్రీకారం చుట్టిన అధికారులు
- చివరి రోజున దరఖాస్తులు స్వీకరించిన ప్రజాప్రతినిధులు, అధికారులు
- అర్హులందరికీ పథకాలు అందుతాయని హామీ

పరిగి: పేదల అభ్యున్నతే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని, అందుకు అందజేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులందరూ వినియోగించుకోవాలని ఎంపీపీ అరవింద్‌రావు అన్నారు. శనివారం మండల పరిధి రంగాపూర్, లక్నాపూర్ గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో పలువురు నుంచి దరఖాస్తులను స్వీకరించి మాట్లాడారు. ఆరు గ్యాంటీలను పేదలకు అందేలా కృషి చేస్తానని చెప్పారు. గ్రామసభల్లో అర్జీ పెట్టుకోని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఇది నిరంతర ప్రక్రియగా ప్రభుత్వం కొనసాగించనుందని, అర్హులు అందరూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కొడంగల్ రూరల్‌లో..

కొడంగల్ రూరల్: అర్హులందరికీ ఆరు గ్యారంటీలు అందుతాయని కౌన్సిలర్ సాయిప్రసన్న, బోయపల్లి తండా సర్పంచ్ గోవిందు, తహసీల్దార్ బి.విజయకుమార్, ఎంపీడీఓ పాండు పేర్కొన్నారు. పట్టణంలోని 12వ వార్డు, మండల పరిధి బోయపల్లితండా, భవనమ్మతండాల్లో నిర్వహించిన ప్రజాపాలనలో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణంరాజు, అంబేడ్కర్ సంఘం నాయకులు రమేష్‌బాబు, ఎంపీఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.



కొడంగల్ రూరల్‌లో..



బొంరాస్‌పేట: తుంకిమెట్లలో

ముగింపు రోజున 1,916

బొంరాస్‌పేట: మండల పరిధిలో ప్రజాపాలన సవ్యంగా సాగింది. బొంరాస్‌పేట, దుద్యాల మండలాల్లో తహసీల్దార్లు వెంకటేశ్, దానయ్య, ఇన్‌చార్జి ఎంపీడీఓ వెంకన్‌గౌడ్, డిప్యూటీ తహసీల్దారు రవిలు అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. చివరి రోజున కొత్తూరులో 626, తుంకిమెట్ల 744, నాందార్‌పూర్ 546 కలిపి మొత్తం 1,490 కుటుంబాల నుంచి 1,916 దరఖాస్తులు అందినట్లు అధికారులు పేర్కొన్నారు.

ప్రజల వద్దకే పాలన

కుల్కచర్ల: ప్రజల వద్దకే ప్రభుత్వ పాలన అని, ప్రజా సంక్షేమం కోసం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలు అర్హులందరికీ అందుతాయని సర్పంచ్ బాలయ్య అన్నారు. కుల్కచర్ల మండలం సాల్వీడ్ గ్రామంలో కొనసాగిన ప్రజాపాలనలో పలువురి నుంచి దరఖాస్తులను స్వీకరించి మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఇప్పటికే రెండు పథకాలను ప్రభుత్వం అమలు చేసిందని, త్వరలో మిగతావి అమలు చేయనున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు విఠల్ తదితరులు పాల్గొన్నారు.

పూడూరులో..

పూడూరు: ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యారంటీ పథకాలు అర్హులందరికీ అందుతాయని తహసీల్దార్ రమాదేవి అన్నారు. మండల పరిధి అంగడిచిట్టంపల్లి గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలనలో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, సర్పంచ్ జయమ్మదాస్, ఎంపీటీసీ సభ్యుడు సురేందర్, నాయకులు రవి, అంజయ్య, చెన్నయ్యగౌడ్, అమర్‌నాథ్, రాజమల్లయ్య, విఠలయ్య, బాలయ్య పాల్గొన్నారు.

ధారూరులో 15,108 దరఖాస్తులు

ధారూరు: ప్రజాపాలనకు మండల పరిధిలోని 11,227 కుటుంబాల నుంచి 15,108 దరఖాస్తులు అందినట్లు ఎంపీపీ జైదుపల్లి విజయలక్ష్మి, ఇన్‌చార్జి ఎంపీడీఓ చెన్నారెడ్డిలు తెలిపారు. మండలంలోని ధర్మాపూర్, కొండాపూర్‌కలాన్, రుద్రారం, కుక్కింద గ్రామ పంచాయతీల్లో జరిగిన గ్రామసభల్లో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అర్హులు చాలా వరకు అర్జీలు పెట్టుకున్నారని, ఎవరైనా మిస్సయిన వారుంటే గ్రామ పంచాయతీ కార్యదర్శులు, అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రాములు, మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు బసప్ప, సర్పంచ్ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరిలో..

అనంతగిరి: అర్హులందరూ సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని ఎంపీపీ అన్నారు. వికారాబాద్ మండలం కామరెడ్డిగూడ, బురాన్‌పల్లి గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలనలో వారు అర్హుల నుంచి అభయహస్తం దరఖాస్తులను స్వీకరించారు. మండల పరిధిలో శనివారం వరకు మొత్తం 10,087 దరఖాస్తులు స్వీకరించినట్లు ఎంపీడీఓ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పురుషోత్తంరెడ్డి, ఈసీ నవీన్‌కుమార్, ఏఈఓ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పరిగి: ప్రజాపాలనలో దరఖాస్తులను స్వీకరిస్తున్న ఎంపీపీ తదితరులు

మోమిన్‌పేటలో..

మోమిన్‌పేట: ఆరు గ్యారంటీల కోసం ప్రజాపాలనకు అర్హుల నుంచి వచ్చిన దరఖాస్తులను కంప్యూటరీకరణ చేయనున్నట్లు మండల ప్రత్యేక అధికారి చరితారెడ్డి పేర్కొన్నారు. ప్రజలు ఫారంలో నింపిన విధంగానే యథాతదంగా ఆన్‌లైన్‌లో పొందుపరచనున్నట్లు వెల్లడించారు. మోమిన్‌పేట మండల పరిధిలో మొత్తం 13వేలకు పైగా అర్జీలు అందినట్లు ఆమె వెల్లడించారు.

దౌల్తాబాద్‌లో..

దౌల్తాబాద్: ప్రజాపాలనలో భాగంగా ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తుల వివరాలను ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వెబ్‌సైట్‌లో నమోదు ప్రక్రియను ప్రారంభించారు. కంప్యూటరీకరణకు వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఆపరేటర్లను ఎంపిక చేసి, నమోదు ప్రక్రియ గురించి సంబంధిత అధికారులు శిక్షణ ఇప్పించారు. లాగిన్ ఐడీ ఇచ్చారు. దీంతో వారు అప్‌లోడ్ కార్యక్రమాన్ని మొదలు పెట్టారు. నిన్నటివరకు దౌల్తాబాద్ మండల పరిధి గ్రామాల్లో మొత్తం 11,658 దరఖాస్తులు వచ్చాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎంపీడీఓ తిరుమలస్వామి, తహసీల్దారు విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ చేస్తున్నారు.

17లోపు కంప్యూటరీకరణ

ప్రత్యేకాధికారి లలితకుమారి



కంప్యూటరీకరణను పరిశీలిస్తున్న అధికారులు

పెద్దేముల్: ప్రజాపాలనలో స్వీకరించిన దరఖాస్తుల కంప్యూటరీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని, ఈ నెల 17లోపు పూర్తి చేయాలని ప్రజాపాలన ప్రత్యేక అధికారి లలితకుమారి, తహసీల్దార్ కిషన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. తహసీల్దార్, ఎంపీడీఓ, వనరుల కేంద్రంలో ప్రజల నుంచి అందిన ఫారాల ఆన్‌లైన్ ప్రక్రియను అధికారులు పరిశీలించారు. పెద్దేముల్ మండల పరిధి 37 గ్రామ పంచాయతీల్లో ఈ నెల 5వ తేదీ వరకు 12, 596 దరఖాస్తులు వచ్చాయని, ఇంకా కొన్ని ప్రాంతాల నుంచి రానున్నాయని వెల్లడించారు. ప్రజల నుంచి అర్జీల్లో టిక్కు పెట్టిన వివరాలను తప్పులు లేకుండా నమోదు చేయాలని, తేదీలు, గ్రామ పంచాయతీల వారీగా స్వీకరించిన ఫారాలను క్షుణ్ణంగా పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. మండలంలో సుమారు 25కు పైగా డాటా ఎంట్రీ ఆపరేటర్లు పనిచేస్తున్నట్లు తెలిపారు. ఎంపీడీఓ లక్ష్మప్ప, డిప్యూటీ తహసీల్దార్ మహేశ్, ఆర్ఐ రాజిరెడ్డి, ఈఓపీఆర్‌డి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



కుల్కచర్ల: సాల్వీడ్‌లో అర్జీలు స్వీకరిస్తున్న సర్పంచ్ బాలయ్య



ధారూరు: కుక్కిందలో దరఖాస్తులు తీసుకుంటున్న ఎంపీపీ విజయలక్ష్మి



అనంతగిరి: మాట్లాడుతున్న ఎంపీపీ



మోమిన్‌పేటలో.. దరఖాస్తులను అప్‌లోడ్ చేస్తున్న డాటా ఎంట్రీ ఆపరేటర్



దౌల్తాబాద్: అర్జీలను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు

ప్రభుత్వ భూమిని కాపాడండి

దోమ: కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని కాపాడాలని బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు మేకల గోవర్ధన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఐనాపూర్ పంచాయతీ కార్యదర్శి హరిశ్వర్‌రెడ్డికి గ్రామస్తులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కొందరు వ్యక్తులు గ్రామ కంఠం భూమితో పాటు ప్రభుత్వ భూమిని కబ్జాచేశారని ఆరోపించారు. ఆ జాగను కాపాడాలని ఇంతకు ముందే కలెక్టర్, డీపీఓ, ఎంపీఓకు వినతిపత్రాలు ఇచ్చామని, కానీ కబ్జాకోరులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. సదరు వ్యక్తులపై చర్యలు చేపట్టి, భూమిని స్వాధీనం చేసుకొని గ్రంథాలయ భవనం లేదా కుల సంఘాల భవనాలను నిర్మించుకునేందుకు కేటాయించాలని కోరారు. లేని పక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. గ్రామస్తులు మునీర్ బాయ్, అంజిలయ్య, వెంకట్‌రాములు, సాయిలు, రాములు, ఎల్లప్ప, సాయిలు పాల్గొన్నారు.

శ్రీవారికి అభిషేకం

కొడంగల్: బాలాజీనగర్‌లో వెలసిన పద్మావతీ సమేత శ్రీ మహాలక్ష్మి వేంకటేశ్వర స్వామికి శనివారం ఉదయం సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. సుప్రభాతం అనంతరం ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు, తిరుప్పావై పారాయణం చేశారు. పూజా కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ధరూర్ శ్రీనివాసాచార్యులు ప్రవచనం వినిపించారు. ఆలయ ధర్మకర్తలు, అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. జనవరి 14న మధ్యాహ్నం 2 గంటలకు శ్రీ గోదాదేవి కల్యాణోత్సవం, సాయంత్రం 4 గంటలకు తిరుచ్చి ఉత్సవ ఊరేగింపు నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. 15న శ్రీవారి తిరుచ్చి ఉత్సవం ఉన్నట్లు వెల్లడించారు.

సోలార్ ఫెన్సింగ్‌తో పందుల బెడదకు విముక్తి

పూడూరు: పొలాల చుట్టూ సోలార్ ఫెన్సింగ్ వేసుకుని జొన్న, మొక్కజొన్న పంటలను కాపాడుకోవచ్చని వ్యవసాయ విశ్వవిద్యాలయం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ సునీత తెలిపారు. శనివారం మండల పరిధి తిరుమలాపూర్ గ్రామంలో పంట పొలాలను ఆమె పరిశీలించారు. అడవికి సమీపాన పొలాలు ఉండటంతో అడవి జంతువుల బెడదతో పంటలు నష్టపోతున్నామని రైతులు అధికారుల దృష్టికి తెచ్చారు. వాటి బెడద నుంచి పంటలను కాపాడుకోవాలంటే భారీ శబ్దం వచ్చే తుపాకి, సోలార్ ఫెన్సింగ్ విధానాలను పాటించాలని రైతులకు సూచించారు. పరికరాలను చూపించారు. చిరుధాన్యాల శాస్త్రవేత్త డాక్టర్ శేఖర్, సర్పంచ్ కమ్లీబాయి, పెంటయ్య, మండల వ్యవసాయ అధికారి తులసీరాం, ఏఈఓలు ఉన్నారు.

పత్తి పైసలు రాలే

- నెల రోజులు గడిచినా బ్యాంకు ఖాతాలో జమకాని డబ్బు
- మిల్లుల చుట్టూ రైతుల ప్రదక్షిణలు
- స్పందించని సీసీఐ అధికారులు



సీసీఐ ద్వారా కొనుగోలు చేసిన పత్తి

పెద్దేముల్: పత్తిని సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించినా సకాలంలో డబ్బులు రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. తూకం వేసిన వారం పది రోజుల్లో బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని అధికారులు చెప్పారని, కానీ నెల కావస్తున్నా డబ్బులు అందలేదని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. డబ్బుల కోసం మిల్లుల చుట్టూ తిరగాల్సి వస్తుందని, సీసీఐకి బదులు దిగుబడిని దళారులకు అమ్మిఉంటే ఈ పాటికి అనాపైసల్తో సహా వచ్చేవని అభిప్రాయ పడుతున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీసీఐలో విక్రయించే సమయంలో.. పత్తి మిల్లుల యజమానులు, దళారులకే ప్రాధాన్యత ఇస్తున్నారని మారేపల్లి, గాజీపూర్, ఇందూర్, పెద్దేముల్ తదితర గ్రామాల రైతులు ఆరోపిస్తున్నారు.

పెరిగిన ఖర్చులు

మండల పరిధి గ్రామాల్లో గతేడాది కంటే ఈ సారి అధిక విస్తీర్ణంలో పత్తిని సాగు చేశారు. భారీ వర్షాల కారణంగా సాధారణ దిగుబడి ఎకరాకు 10నుంచి 16 క్వింటాళ్లు కాగా.. ప్రస్తుతం 5నుంచి 7 క్వింటాళ్లు మాత్రమే వచ్చిందని రైతులు వెల్లడించారు. పెట్టుబడులు కూడా ఎక్కువయ్యాయని, ఎకరాకు రూ.25వేల నుంచి రూ.30వేల వెచ్చించినట్లు పేర్కొంటున్నారు. ఇలా ఎన్నోకష్టనష్టాల కోర్చి పంట పండిస్తే.. మద్దతు ధరలేక పోవటం ఒకటైతే.. సీసీఐలో విక్రయించిన నెల రోజులకు కానీ డబ్బులు రావడం లేదని వాపోతున్నారు. ఈ జాప్యంతో ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. ప్రభుత్వం స్పందించి సీసీఐలో పత్తిని అమ్మిన మూడు రోజుల్లో డబ్బులు వచ్చేలా చూడాలని రైతులు కోరుతున్నారు. ఆ పంట డబ్బును ఆధార్ లింక్‌కు ఉన్న బ్యాంకు ఖాతాలో జమచేయాలని, ఇతర బ్యాంకుల్లో వేస్తే సమయానికి రావడం లేదని పేర్కొంటున్నారు.

నెల రోజులైనా డబ్బులు రాలే



పత్తి విక్రయించి రోజులు గడిచినా డబ్బులు రావటం లేదు. మిల్లుల వద్దకు వస్తే సమస్యను ఎవరూ పట్టించుకోవడం లేదు. అందుకే దళారులను ఆశ్రయిస్తున్నాం. మా గోడు ఎవరికిచెప్పినా లాభం లేదు. అధికారులు స్పందించి దిగుబడిని తీసుకున్న మూడు రోజుల్లో డబ్బులు బ్యాంకు ఖాతాలో జమ అయ్యేలా చూడాలి.

– తమ్మన్న, రైతు, పెద్దేముల్

బ్యాంకులో వేయమంటే..



మారేపల్లి సాయిబాబ కాటన్ మిల్లులో 49 క్వింటాళ్ల పత్తిని గత నెల 15న విక్రయించాను. డబ్బులు బ్యాంకులో వేయమని ఖాతా నంబర్ ఇచ్చాను. పైసలు ఇంకా రాలేదని సీసీఐ అధికారులను అడిగితే పోస్టాఫీసులో జమ అయినట్లు పేర్కొన్నారు. తమకు అనుకూలంగా ఉన్న ఖాతా నంబర్ ఇచ్చినప్పుడు అందులోనే వేయాలి.

– సంగయ్య రైతు కోటపల్లి

దిగులు వద్దు

ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో పత్తిని విక్రయిస్తే డబ్బులు తప్పకుండా వస్తాయి. కాస్త ఆలస్యం అయినా రైతులు దిగులు చెందాల్సిన అవసరం లేదు. విషయాన్ని సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తాను. దళారులకు ఆశ్రయించి మోసపోవద్దు.

– కిషన్, తహసీల్దార్, పెద్దేముల్

చదవడం, రాయడం నేర్పించాలి

- విద్యార్థుల సామర్థ్యం పెంపునకు కృషి
- మండల విద్యాధికారి హరిశ్చందర్



దోమ: సమావేశంలో మాట్లాడుతున్న మండల విద్యాధికారి హరిశ్చందర్

దోమ: ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం నేర్పించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల విద్యాధికారి హరిశ్చందర్ సూచించారు. శనివారం దోమ మండలం కిష్టాపూర్, బొంపల్లి కాంప్లెక్స్ పరిధి పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు బోధన అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడారు. ప్రతి ఉపాధ్యాయుడు సమయ పాలన పాటించి, విద్యార్థులకు అర్థమయ్యే విధంగా పాఠాలు బోధించి, పఠనాశక్తిని పెంపొందించేలా కృషి చేయాలన్నారు. ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్, యూడైస్, ఎఫ్ఎల్ఎన్ సామర్థ్యాలు, ఎఫ్ఏ3 మార్కుల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాలని చెప్పారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ పాఠశాలల ప్రధానోపాధ్యాయుడు వెంకట్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో పనిచేయాలి

పెద్దేముల్: విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాన్ని పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని పెద్దేముల్ మండల కందనెల్లి, పెద్దేముల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు శివకుమార్, శంకర్ సూచించారు. పెద్దేముల్ మండల కేంద్రంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఉపాధ్యాయుడు తరగతి గదిలో టీఎల్ఎం వాడాలని, కథల పుస్తకాలు చదివించాలని, ప్రతి నెల 3న తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. వెనుకబడిన విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని చెప్పారు. కార్యక్రమంలో పట్లోళ్ల అనిల్, రాజేశ్, శ్రీనివాస్, బందెప్ప, రాజేశ్, శంకర్, సంగమేశ్, సలీం, ప్రమోద్, ఊర్మిళ, మణి, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతల శోభాయాత్ర



అక్షింతల పంపిణీ

కొడంగల్ రూరల్: అయోధ్య అక్షింతల శోభాయాత్ర ఘనంగా జరిగింది. అయోధ్య శ్రీరామతీర్థ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం మండల పరిధి అన్నారం గ్రామంలో శ్రీవెంకటేశ్వర స్వామివారి దేవాలయం నుంచి ప్రధాన వీధులగుండా ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అనిత, గ్రామస్తులు ప్రవీణ్, రవి, దీపక్‌రెడ్డి, రాములు, చెన్నప్ప, సాయిలు, ఆనంద్, వెంకటప్ప భజనలు చేస్తూ రాములోరి అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేశారు.

నేడు మహోత్సవం

పట్టణంలోని అభయాంజనేయస్వామి దేవాలయం నుంచి శ్రీమహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామివారి ఆలయం వరకు ఆదివారం రాములోరి అక్షింతల ఊరేగింపు నిర్వహించనున్నట్లు శ్రీరామజన్మ భూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ సభ్యులు తెలిపారు. ఉదయం 8గంటల నుంచి ఉత్సవం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమానికి భక్తులు తరలి రావాలని కోరారు.

శబరిమలలో వసతులు కల్పించండి

అనంతగిరి: శబరిమలకు వెళ్లే అయ్యప్ప భక్తులకు కేరళ రాష్ట్రంలో వసతులు కల్పించాలని వికారాబాద్ అయ్యప్ప సేవా సమితి ప్రతినిధులు కోరారు. ఈ మేరకు శనివారం శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ యేడాది అక్కడి ప్రభుత్వం సరైన వసతులు కల్పించకపోవడంతో భక్తులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. సమస్యను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, అక్కడ నీరు, భోజనవసతితో పాటు తదితర సౌకర్యాలను కల్పించాలని కోరారు.



సభాపతి ప్రసాద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న అయ్యప్ప భక్తులు